ప్రజాశక్తి
మంగళవారం 14 మార్చి 2023 5
శ్రీ సత్యసాయి

పోలింగ్ సరళిపై అనంతపురం కలెక్టరేట్ నుంచి పోలింగ్ ప్రక్రియను వెబ్ క్యాస్టింగ్ ద్వారా పరిశీలిస్తున్న అనంతపురం కలెక్టర్ నాగలక్ష్మి, ఎన్నికల పరిశీలకులు పోలా భాస్కర, హరిజవహార్

పోలింగ్ శాతం - సత్యసాయి జిల్లా

సమయం	పట్టభద్రులు	ఉపాధ్యాయులు
10గం॥	11.34	19.08
12గం॥	32.13	53.46
2గం॥	52.19	76.88
4గం॥	67.13	92.71

పోలింగ్ శాతం - అనంతపురం జిల్లా

సమయం	పట్టభద్రులు	ఉపాధ్యాయులు
10గం॥	12.00	18.00
12గం॥	31.23	46.62
2గం॥	49.93	64.22
4గం॥	67.13	87.31

మండలిపోరు ప్రశాంతం

- ఓటేసేందుకు ఉత్సాహం
- తరలివచ్చిన పట్టభద్రులు, ఉపాధ్యాయులు
- సాయంత్రం 6గం॥ల వరకు పోలింగ్
- ఒకే కేంద్రం ఏర్పాటుతో ఇబ్బందులు
- మౌలిక వసతుల కల్పన నామమాత్రం
- కొన్ని సెంటర్లలో నీరు లేక ఓటర్ల అవస్థలు

ఉమ్మడి అనంతపురం జిల్లా వ్యాప్తంగా మండలి పోరు సోమవారం నాడు ప్రశాంతంగా ముగిసింది. చిన్నపాటి సమస్యలు మినహా ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలూ చోటు చేసుకోకుండా పోలింగ్ కొనసాగింది. రెండు జిల్లాల పరిధిలో ఆయా పోలింగ్ కేంద్రాల్లో ఉదయం 8 గంటలకు పోలింగ్ ప్రారంభం అయ్యింది. ఉదయం నుంచే ఓటు వేసేందుకు పట్టభద్రులు, ఉపాధ్యాయులు ఆసక్తి చూపారు. ఓటేసేందుకు క్యూలైన్లలో బారులుదీరారు. వికలాంగులు, మహిళలు కూడా ఉత్సాహంగా ఓటింగ్‌లో పాల్గొన్నారు. బాలింతలు చిన్న పిల్లలను సైతం ఎత్తుకుని పోలింగ్ కేంద్రాల వద్దకు వచ్చి ఓటు వేశారు. ప్రముఖులు వారి ప్రాంతాల్లో ఓటు హక్కును వినియోగించుకున్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలూ చోటు చేసుకుండా పోలీసులు పట్టిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. రెండు జిల్లాల కలెక్టర్లతో పాటు జిల్లా అధికారులు, ఎన్నికల సిబ్బంది ఎప్పటికప్పుడు పోలింగ్ సరళిని పరిశీలించారు. మండల కేంద్రాల్లో ఒకే పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేయడంతో ఓటర్లు ఇబ్బందులు పడ్డారు. ఓటు వేసేందుకు గంటల కొద్దీ క్యూలైన్లో వేచి ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. ఎండవేడిమిన తట్టుకోలేక కొందరు ఇళ్లకు వెళ్లిపోయారు. పోలింగ్ కేంద్రాల వద్ద తాగునీటి వసతిని నామమాత్రంగా ఏర్పాటు చేయడంతో ఓటర్లు ఇబ్బంది పడ్డారు.

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల, ఉపాధ్యాయ నియోజకవర్గానికి జరిగిన శాసనమండలి ఎన్నికలు ఉమ్మడి జిల్లాలో సజావుగా, ప్రశాంతంగానూ జరిగాయి. కొన్ని కేంద్రాల్లో స్వల్పంగా నిర్వహణ లోపాలు కొట్టుచ్చినట్టు కనిపించాయి. 1400 మంది ఓటర్లు ఉన్న చోట కూడా ఒకే పోలింగ్ కేంద్రమే కావడంతో అటువంటి చోట రద్దీ కనిపించింది. కొన్ని చోట్ల మాత్రం సాధారణ పోలింగే జరిగింది. తాడిపత్రిలో 146 పోలింగ్ బూత్‌లో వైసిపి ఏజెంటు ఓటర్ల జాబితా తీసుకెళ్లడంతో కొంత సేపు వివాదం చోటు చేసుకుంది. దీంతో పోలింగ్‌కు 15 నిమిషాలు అంతరాయం ఏర్పడింది. ఆతరువాత అధికారుల జొక్యంతో సద్దుమణిగింది. బెళుగుప్పలోనూ వైసిపి, టిడిపి నేతల మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. పోలీసుల జోక్యంతో సమస్య సద్దుమణిగింది. ఒకటి, రెండు చోట్ల ఓట్ల గల్లంతు సమస్య కూడా వచ్చింది. హిందూపురంలో తేజారెడ్డి అనే వ్యక్తి పట్టభద్రుల నియోజకవర్గానికి ఓటు వేయడానికి విమానంలో హైదరాబాద్ నుంచి ఇక్కడికి విచ్చేశారు. అయితే జాబితాలో ఓటు లేకపోవడంతో ఆవేదన వ్యక్తం చేశాడు. అనంతపురం నగరంలోని కెఎస్‌ఆర్ కళాశాలలోని పోలింగ్ కేంద్రంలోనూ ఇదే రకంగా చోటు చేసుకోవడం బిజెపి నాయకులు నిరసన వ్యక్తం చేశారు. జిల్లాలోని ప్రజాప్రతినిదులు, రాజకీయ ప్రముఖులు కూడా క్యూలైన్లలో నిలబడి ఓట్లు వేశారు. అనంతపురం నగరంలో ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే ప్రభాకర్ చౌదరితోపాటు పలువురు ప్రముఖులందరూ ఓటు వేశారు. సత్యసాయి జిల్లా కలెక్టర్ బసంత్‌కుమార్, ధర్మవరం ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డిలు క్యూలైన్‌లో నిల్చొని ఓటు వేశారు.

పట్టభద్రులకు 65.92 శాతం పోలింగ్

పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల నియోజకవర్గానికి సంబంధించి మొత్తం కడప, అనంతపురం, కర్నూలు నియోజకవర్గం పరిధిలో 65.92 శాతం ఓట్లు పోలయ్యాయి. అనంతపురం జిల్లాలో 67.13 శాతం, సత్యసాయి జిల్లాలో 75.32 శాతం, కడప జిల్లాలో 60.89 శాతం, అన్నమయ్య జిల్లాలో 68.31 శాతం, కర్నూలు జిల్లాలో 59.37 శాతం, నంద్యాల జిల్లాలో 70.90 శాతం పోలింగ్ జరిగింది. ఉపాధ్యాయ నియోజకవర్గానికి సంబంధించి పశ్చిమ రాయలసీమ నియోజకవర్గం పరిధిలో మొత్తం 89.38 శాతం పోలింగ్ జరిగింది. అనంతపురం జిల్లాలో 87.31 శాతం సత్యసాయి జిల్లాలో 92.71 శాతం, కడప జిల్లాలో 85.24 శాతం, అన్నమయ్య జిల్లాలో 93.36 శాతం, కర్నూలు జిల్లాలో 90.26 శాతం, నంద్యాల జిల్లాలో 93.63 శాతం పోలింగ్ నమోదు అయ్యింది.

గుంతకల్లులో పట్టభద్రుల ఓటు వేసిన వికలాంగుడు

ఓటు వేసేందుకు క్యూలైన్లో నిల్చున్న సత్యసాయి జిల్లా కలెక్టర్ బసంత్‌కుమార్

సత్యసాయి జిల్లాలో ఎన్నికలు ప్రశాంతం : కలెక్టర్

పుట్టపర్తి అర్బన్ : సత్యసాయి జిల్లాలో ఎమ్మెల్సీ ఎన్నికలు ప్రశాంతంగా, సజావుగా జరిగాయని కలెక్టర్ బసంత్ కుమార్ తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లో ఆయన విలేకరులతో జిల్లాలో పట్టభద్రుల ఎన్నికల కోసం 54 పోలింగ్ కేంద్రాలు, ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ ఎన్నికల కోసం 32 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. వీటిలో ఎలాంటి ఇబ్బందులూ లేకుండా పోలింగ్ జరిగిందన్నారు. పోలింగ్ నిర్వహణలో జిల్లా అధికారులు, ఎన్నికల సిబ్బంది తీసుకున్న చర్యలు విజయవంతం అయ్యాయన్నారు. అన్ని శాఖలు సమన్వయంతో పని చేశాయని చెప్పారు. కౌంటింగ్ కూడా కట్టుదిట్టమైన భద్రత నడుమ సజావుగా నిర్వహిస్తామని కలెక్టర్ పేర్కొన్నారు.

నేడు 'అనంత'జెఎన్‌టియుకు బ్యాలెట్ బాక్సులు

పశ్చిమ రాయలసీమ నియోజకవర్గం పరిధి మొత్తం ఆరు జిల్లాల్లో ఉండటంతో పోలింగ్ పూర్తయిన తరువాత సోమవారం రాత్రి బ్యాలెట్ బాక్సులను ఆయా జిల్లాల్లోని స్ట్రాంగ్ రూములకు చేరుస్తారు. వీటిని అక్కడి నుంచి మంగళవారం ఉదయం అనంతపురం నగరంలోని జెఎన్‌టియు కళాశాలలో ఓట్ల లెక్కింపు జరిగే కేంద్రానికి చేర్చనున్నారు. మంగళవారం ఉదయమే పోలింగ్‌కు సంబంధించిన స్క్రూటినీ సైతం మంగళవారం నాడు కలెక్టరు, ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఎస్.నాగలక్ష్మి సమక్షంలో జరుగనుంది.

మడకశిరలో పట్టభద్రుల ఓటు వేసేందుకు చంటిబిడ్డతో పోలింగ్ కేంద్రానికి వచ్చిన బాలింత

ఓటేయలేక వెనుదిరిగారు..

చెన్నేకొత్తపలిల్లో రద్దీ ఎక్కువ ఉండడంతో ఓటేయకుండా వెనుదిరుగుతున్న ఓటర్లు

చెన్నేకొత్తపల్లి: శ్రీ సత్యసాయి జిల్లా చెన్నేకొత్తపల్లి మండలానికి సంబంధించి చెన్నేకొత్తపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఇక్కడ 1400 మంది పట్టభద్రుల ఓటర్లు ఉన్నారు. ఒకటే పోలింగ్ కేంద్రం ఉండడంతో ఓటేసేందుకు గంటల తరబడి క్యూలైన్లో వేచి ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. ఎండవేడమిన తట్టుకోలేక చాలా మంది ఓటు వేయకుండానే వెనుదిరిగారు. అధికారులు ఓటు వేయాలని విజ్ఞప్తి చేసినా చాలా మంది అక్కడ పరిస్థితిని తట్టుకోలేక ఇళ్లకు వెళ్లిపోయారు.

వైసిపి రుబాబు..

గుంతకల్లులో పిడిఎఫ్ ఏజెంట్‌పై రుబాబు చేస్తున్న వైసిపి నాయకులు

గుంతకల్లు : గుంతకల్లు 160వ పోలింగ్ బూత్‌లో వైసిపి నాయకులు పిడిఎఫ్ ఏజెంట్‌పై రుబాబు చేశారు. ఓటరు జాబితాలో ఫొటో లేకుండా ఓటు వేసేందుకు వచ్చిన ఓటరు వివరాలపై పిడిఎఫ్ ఏజెంట్ అభ్యంతరం తెలిపారు. దీనికి వైసిపి నాయకులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఏజెంట్‌ను దూషించారు. ఏజెంట్‌గా ఉనన వ్యక్తిని ఏకంగా అక్కడి నుంచి వెళ్లిపోవాలంటూ ప్రతాపం చూపారు. అక్కడే ఉన్న అధికారులు కలుగజేసుకుని ఇద్దరికి సర్దిచెప్పారు.

నువ్వు ఓటరా..

లుంగీతో వచ్చిన వ్యక్తి ఓటు ధ్రువీకరణ పత్రాలు చూస్నున ఎస్ఐ

మడకశర : మడకశిర మండలం కంఠీపురం గ్రామానికి చెందిన తిప్పేస్వామి ఓటు హక్కు వినియోగించుకునేందుకు మడకశిర పట్టణంలోని పోలింగ్ కేంద్రానికి వచ్చాడు. స్వతహాగా రైతు అయన లుంగీ, చొక్కాతో పోలింగ్ కేంద్రం క్యూలైన్‌లో నిల్చున్నాడు. ఈయన పట్టభద్రుడు కాడేమో అన్న అనుమానంతో ఎస్ఐ నాగేంద్ర ఆయన్ను పక్కకు పిలిచి వివరాలు అడిగాడు. తిప్పేస్వామి పట్టభద్రునిగా అన్ని పత్రాలు ఉండడంతో పోలీసులు ఖంగుతిన్నారు. పట్టభద్రుడు అయ్యి ఉండి రైతుగా ఆయన ఓటేసేందుకు వచ్చిన తీరుపై అక్కడున్న వారు అభినందించారు.

కమనీయం ఖాద్రీశుని రథోత్సవం

◆ జనంతో కిక్కిరిసిన కదిరి మాడావీధులు ◆ రథంపై దర్శనమిచ్చిన శ్రీవారు

కదిరి మాడా వీధుల గుండా కొనసాగుతున్న నారసింహుని రథోత్సవం

కదిరి అర్బన్ : కదిరి ఖాద్రీ లక్ష్మీనరసింహ స్వామి బ్రహ్మోత్సవాల్లో అత్యంత ప్రాముఖ్యమైన బ్రహ్మరథోత్సవం సోమవారం నాడు కమనీయంగా జరిగింది. అశేష జనవాహిని నడుమ అంగరంగ వైభవంగా రథోత్సవం కొనసాగింది. భారతదేశంలోనే 3వ అతిపెద్ద తేరుగా చెప్పుకున ఈ రథోత్సవం కనులపండువగా సాగింది. ఆంధ్ర, తెలంగాణ, కర్నాటక తదితర రాష్ట్రాల నుంచి వచ్చిన లక్షలాది మందితో కదిరి మాడావీధులు కిక్కిరిశాయి. ఆలయ ప్రధాన అర్చకులు నిర్ణయించిన సమయానికి రథోత్సవం ప్రారంభం అయ్యింది. పట్టణ ప్రముఖులు, ప్రజాప్రతి నిధులు, ఆలయ అర్చకులు ఆనవాయితీగా ప్రత్యేక చేయాల్సిన పూజలన్నింటినీ పూర్తి చేసి రథోత్సవాన్ని ప్రారంభించారు. ఉదయాన్నే ప్రత్యేక పూజలు జరిపి మేళతాళాలతో ఎమ్మెల్యే డాక్టర్ పివి.సిద్ధారెడ్డి పాలకమండలి ఛైర్మన్ గోపాలకష్ణ, ఆలయ ఈవో గురుప్రసాద్, ప్రముఖులు ఇందులో పాల్గొన్నారు. గోవింద, నారసింహస్వామి నామ స్మరణలతో తిరువీధులన్నీ మారుమోగాయి. స్వామివారికి ప్రీతి అయిన దవనం, మిర్యాల గుమ్మడికాయలు భక్తులు స్వామివారికి, భక్తులు మొక్కుబడులు చెల్లించారు. ఉత్సాహంగా భక్తులు మొకులు లాగి రథాన్ని యథాస్థానానికి చేర్చారు. రథోత్సవం సందర్భంగా భక్తులకు ఎలాంటి ఇబ్బందులూ లేకుండా ఆలయ అధికారులు, కమిటీ సభ్యులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. పోలీసుల భారీ ఎత్తున బందోబస్తు ఏర్పాటు చేశారు. భక్తుల కోసం అన్నదాన కేంద్రాలు, మజ్జిగ, చల్లని పానీయాలు, మిఠాయిలను దాతలు పంపిణీ చేశారు.

రథోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే డా॥ పివి.సిద్ధారెడ్డి, ఆలయ ట్రస్టు సభ్యులు

డిబిసిడబ్ల్యూఒ అక్రమాస్తులపై విచారణ చేపట్టాలి

పిఎస్‌యు రాష్ట్ర ఉపాధ్యక్షుడు అల్లాపురం చంద్ర

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

శ్రీసత్యసాయి జిల్లాకు రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా నియమించిన డిబిసిడబ్ల్యూఒ నిర్మల జ్యోతి అక్రమాలు రోజురోజుకూ అధికమవుతున్నాయని ఆమె అక్రమాస్తులపై విచారణ జరిపించి తగిన చర్యలు తీసుకోవాలని ప్రోగ్రెసివ్ స్టూడెంట్స్ యూనియన్ (పియుఎస్)రాష్ట్ర ఉపాధ్యక్షుడు అల్లాపురం చంద్ర డిమాండ్ చేశారు. ఈమేరకు ఆయన సోమవారం పుట్టపర్తిలో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం వెనుకబడిన తరగతుల సంక్షేమ వసతి గృహాల్లో చదువుతున్న విద్యార్థుల బాగోగులు చూసుకోవడానికి నిర్మల జ్యోతిని డిబిసిడబ్ల్యూ గా నియమించిందన్నారు. అయితే ఆమె విద్యార్థుల సమస్యలు పట్టించుకోవటం లేదని విమర్శించారు. హాస్టల్లో సమస్యలను గుర్తించి వార్డన్లను వేధించడంరికార్డులను తన ఇంటికి తెప్పించుకొని రూ. 20వేలు ఇస్తేనే రికార్డులిస్తానడం లేకపోతే మెమో ఇస్తానని బెదిరించడం లాంటి చర్యలకు పాల్పడుతోందని ఆరోపించారు. ప్రతి నెల ఒక విద్యార్థికి వస్తున్న మెస్ ఛార్జీలోనుంచి తనకు 35 రూపాయలు ప్రకారం వసూలు చేసి తెచ్చి ఇవ్వాలని అసిస్టెంట్ బిసి వెల్ఫేర్ అధికారులను బెదిరిస్తోందని ఆరోపించారు. ఇద్దరు వార్డెన్లు బహిరంగంగా చెప్పులతో కొట్టుకున్నా చర్యలు తీసుకోలేదని అన్నారు. ఈమె గతంలో కడప జిల్లా డిబిసిగా పనిచేసారని అక్కడ కూడా ఆమెపై అనేక ఆరోపణలు ఉన్నాయని చెప్పారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ఆరోపణలపై సమగ్ర విచారణ జరిపించి అక్రమాస్తులను సీజ్ చేసి ఆమెను ప్రభుత్వానికి సరెండర్ చేయాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా ఆమె అవినీతికి సహకరిస్తున్న ఎబిసిడబ్ల్యూఒలపై త్వరలో వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీకి ఫిర్యాదు చేస్తున్నట్లు తెలిపారు.

ఈ-క్రాప్ బుకింగ్ 97శాతం పూర్తి

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం డివిజన్ వ్యాప్తంగా 2022-23 రబీ సిజన్‌లో ఈ-క్రాప్‌ను 97 శాతం పూర్తి చేసి, ఆయా ఆర్‌బికెలలో జాబితాను సిద్ధంగా ఉంచినట్లు ఎడి అల్తాఫ్ అలీఖాన్ తెలిపారు. హిందూపురం డివిజన్ వ్యాప్తంగా 2022-23 రబీ సీజన్‌లో 7467 మంది రైతులకు గాను 11042 ఎకరాలు ఈ క్రాప్ నమోదు చేసినట్లు చెపాపరు. రైతుల ఈ- కె.వై.సి 97 శాతం పూర్తిచేశామన్నారు. దీనిని డివిజన్‌లోని అన్ని రైతు భరోసా కేంద్రాల వద్ద మార్చి 10న యాప్ ముసాయిదా జాబితాను ప్రదర్శించామన్నారు. సామాజిక తనిఖీల్లో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా అర్ బి కె లలో ప్రదర్శిస్తున్న రబీ 2022-23 సీజన్‌కు సంబంధించి క్రాప్ ముసాయిదా జాబితా ఈ నెల 13 నుండి 17 వరకు ప్రదర్శించనున్నామని చెప్పారు. అనంతరం నిర్వహించే గ్రామసభల్లో అభ్యంతరాలు తెలియజేయాలన్నారు.

జిల్లాలో 97శాతం రైతుల ఈకేవైసీ పూర్తి

పుట్టపర్తి రూరల్: శ్రీ సత్య సాయి జిల్లాలో 2022-23 జిల్లాలో రబీ పంట సాగుచేసిన రైతుల ఈ పంట నమోదు 97శాతంం పూర్తి చేసినట్లు జిల్లా వ్యవసాయ అధికారి వైవి సుబ్బారావు తెలిపారు. జిల్లాలో రబీ సీజన్లో 960,24 ఎకరాలలో పంట నమోదు చేశామన్నారు. అదేవిధంగా 2022 ఖరీఫ్ సీజన్లో 8.04 లక్షల ఎకరాల్లో పంట నమోదు పూర్తి కాగా జిల్లాలోని అన్ని గ్రామాల్లోని ఆర్‌బికెల వద్ద మార్చి 10వ తేదీన ఈ క్రాప్ ముసాయిదా జాబితాను ప్రదర్శించినట్లు చెపాపరు. సామాజిక తనిఖీల్లో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా ఆర్‌బికెలలో ప్రదర్శిస్తున్న రబీ 2022- 23 సీజన్ కి సంబంధించి ఈ క్రాప్ ముసాయిదా జాబితాను ఈనెల 13వ తేదీ నుండి 17వ తేదీ వరకు సామాజిక తనిఖీ కొరకు ప్రదర్శించనున్నట్లు ఆయన తెలిపారు. అదేవిధంగా గ్రామ సభలు కూడా నిర్వహిస్తారని అందులో ఆర్‌బికె సిబ్బంది జాబితాలో ఉన్న రైతుల వివరాలు చదివి వినిపిస్తారని చెప్పారు. రైతులు వారి పరిధిలోని రైతు భరోసా కేంద్ర పరిధిలో ఉన్న ముసాయిదా జాబితాను పరిశీలించి అభ్యంతరాలుంటే రైతు భరోసా కేంద్రంలోని అధికారులను సంప్రదించాలని తెలిపారు.

విద్యుత్ సబ్‌స్టేషన్ ఏర్పాటుకు భూమిపూజ

గోరంట్ల :మండలంలో కమ్మవారి పల్లి గ్రామ సమీపాన విద్యుత్ సబ్‌స్టేషన్ ఏర్పాటుకు సర్పంచి శివశంకర్ రెడ్డి సోమవారం భూమి పూజ చేశారు. కమ్మవారి పల్లి పంచాయతీలో విద్యుత్‌లో వోల్టేజ్ సమస్య తీవ్రంగా ఉండడంతో ప్రజల విన్నపం మేరకు ఎమ్మెల్యే శంకర్ నారాయణ స్పందించి విద్యుత్ సబ్‌స్టేషన్ మంజూరు చేయించడం పట్ల గ్రామస్తులు హర్ష వ్యక్తం చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ శ్రీనివాస్ రెడ్డి, ఎడి శ్రీకాంత్ రెడ్డి, ఎఇ శ్రీనివాస్, స్థలదాతలు కృష్టారెడ్డి, గోవర్ధన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రంలో పారదర్శకతకు పాతర

కేంద్రాల ఏర్పాటులో గందరగోళం

ప్రజాశక్తి -మడకశిర

ఓటర్ల సంఖ్యకు అనుగుణంగా పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడంతో ఓటర్లు గంటల తరబడి క్యూ లైన్‌లో నిలబడాల్సి వచ్చింది. కొంతమంది అయితే మళ్లీ వచ్చి ఓటు వేస్తామని చెప్పి అక్కడి నుంచి వెళ్లిపోయారు. మడకశిర మండల పరిధిలో 1463 మంది పట్టభద్రులు తమ ఓటు హక్కును వినియోగించుకోవాల్సుంది. ఈనేపథ్యంలో అధికార యంత్రాంగం రెండు పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసినప్పటికీ ఓ పోలింగ్ కేంద్రానికి 1158 మంది ఓటర్లను కేటాయించి మరో కేంద్రంలో కేవలం 325 మంది ఓటర్లను కేటాయించారు. మరో ప్రక్క 214 పోలింగ్ కేంద్రం వద్ద అత్యధిక స్థాయిలో ఓటర్లు లైన్లో వేచిచూసి ఓటు వేయాల్సి వచ్చింది. మరోవైపు 214ఎ పోలింగ్ కేంద్రంలో అత్యల్పంగా ఓటర్లు ఉండడంతో ఆ పోలింగ్ కేంద్రం ఓటర్లు లేక బోసిపోయింది. దీనికి తోడు పోటీ చేస్తున్న అభ్యర్థులు 49 మంది ఉండడం వల్ల చేత్తాడంత పొడవు, బారెడు అంత వెడల్పు బ్యాలెట్ కలిగి ఉండడం నేపథ్యంలో అభ్యర్థిని ఓటు వేయడానికి కొంత సమయం పట్టింది. వయసు మళ్ళిన వారికి ఇది మరింత ఇబ్బందికరంగా మారింది. ఈ నేపథ్యంలో ఓటు హక్కును త్వరగా వినియోగించుకోలేకపోవడంతో క్యూ లైన్ మరింత పెరిగింది. బ్యాలెట్ ఇంత పెద్దగా ఉన్నప్పుడు రెండు పోలింగ్ కేంద్రాలకు ఓటర్లను సమానంగా చేసి ఉంటే ఈ పరిస్థితి ఉండేది కాదని మాజీ మంత్రి రఘువీరారెడ్డి వ్యాఖ్యానించారు. ఓటు హక్కు వినియోగించుకున్న తర్వాత బయటకు వచ్చి పాత్రికేయులతో మాట్లాడుతూ బ్యాలెట్ పేపర్‌ను చూసి ఓటు వేయడానికి సమయం పట్టిందని అక్కడ కాస్త చీకటిగా ఉంటే కిటికీ వద్దకు వచ్చి చూసి వేయాల్సిన పరిస్థితి ఏర్పడిందని అన్నారు. దీన్ని బట్టి చూస్తే అక్కడ సౌకర్యాలు ఏ విధంగా ఉన్నాయో అర్థం అవుతోంది. మరో ప్రక్క టీచర్ల ఓటింగ్ పోలింగ్ కేంద్రాల నడుమ ఏర్పాటు చేయడంతో ఉపాధ్యాయులు కాస్త అసహనానికి గురయ్యారు. పట్టభద్రుల ఓటర్లను రెండుగా విభజించినప్పుడు 214, 214 ఏ లను పక్క పక్కన ఏర్పాటు చేయకుండా ఈ రెండు కేంద్రాల నడుమ ఉపాధ్యాయ పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేయడంలో అనాలోచిత నిర్ణయమని వ్యాఖ్యానించారు. ఇదిలా ఉండగా పట్టభద్రుల ఓటర్ల లైన్లో పట్టభద్రుడైన కంఠీపురం గ్రామానికి చెందిన వ్యవసాయదారుడు తిప్పేస్వామి పంచె ఎగగట్టుకొని మరక చొక్క ధరించి ఓటు వినియోగించుకోవడానికి క్యూలైన్లో నిల్చొని ఉండగా ఎస్ఐ నాగేంద్ర అనుమానం వ్యక్తం చేశారు. దొంగ ఓటు వేయడానికి వచ్చాడని అనుమానించి ఆయనను ప్రశ్నించాడు. అయితే తిప్పేస్వామి ఫోటో గుర్తింపు కార్డు, ఆధారాలు చూపడంతో ఓటరు పట్టభద్రుడైన వ్యవసాయదారుడు అని నిర్ధారించుకున్న ఎస్ఐ మిన్నకుండిపోయారు.

అధికారుల పర్యవేక్షణ లోపం

2023 చోట 2013 అంటూ ముద్రణ

ప్రజాశక్తి-హిందూపురం

పశ్చిమ రాయలసీమ పట్టుభద్రులు, ఉపాధ్యాయ శాసన మండలి ఎన్నికలు 2023వ సంవత్సరంలో జరుగుతున్నాయి. అయితే అధికారుల పర్యవేక్షణా లోపం వల్ల 2013లో జరుగుతున్నట్లు బ్యాలెట్ నమూన పత్రాలలో ముద్రించారు. దీనిని గమనించకుండా పోలింగ్ అధికారులు సోమవారం జరిగిన ఎన్నికల్లో వారి పోలింగ్‌కేంద్రాల ముందు ఏర్పాటు చేసిన బ్యాలెట్ నమూనా పత్రాలలో ఆంధ్రప్రదేశ్ శాసనమండలి ఎన్నికలు 2013 అంటూ ముద్రించిన పత్రాలను అతికించారు. దీనిపై కొంత మంది ఫిర్యాదు చేయడంతో అధికారులు పెన్నుతో సరిచేశారు. రాజ్యాంగ బద్ధంగా జరిగే ఎన్నికల్లో అధికారులు ఇంత నిర్లక్ష్యంగ వ్యవహరించడంపై పట్టుభద్రులు, ఉపాధ్యాయులు అధికారుల తీరుపై అసహనం వ్యక్తం చేశారు.



సంవత్సరం తప్పుగా ముద్రించిన అభ్యర్థుల జాబితా

పెరిగిన ఓటింగ్ శాతం

కొత్తచెరువు : కొత్తచెరువు లోనే బాలికల ఉన్నత పాఠశాలలో సోమవారం నిర్వహించిన ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోలింగ్ శాతం గణనీయంగా పెరిగింది. ఓటు వేయడానికి మహిళలు పురుషులు క్యూలైన్‌లో బారులు తీరారు మండల వ్యాప్తంగా పట్టభద్రులు 1715 ఓట్లకు గాను రెండు పోలింగ్‌కేంద్రాల్లో 1347 ఓట్లు పోలయ్యాయి. దీంతో 78.5 శాతం పోలింగ్ నమోదైంది. ఉపాధ్యాయులు 120 మందికి గాను 114 మంది ఓటు హక్కును వినియోగించుకోవటంతో 95శాతం పోలింగ్ నమోదైంది. పోలింగ్ సమయం నాలుగు గంటలు దాటినా కూడా ం 50 మంది దాకా ఓటర్లు క్యూలో ఉండగా వారు ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఈ పోలింగ్ కేంద్రాలను జిల్లా కలెక్టర్ బసంత్‌కుమార్ పరిశీలించారు. పోలింగ్ కేంద్రాన్ని వైసీపీ అభ్యర్థి వెన్నపూస రవీందర్ రెడ్డి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో పుట్టపర్తి ఆర్డీవో భాగ్యరేఖ, ఎస్ఐ బాబ్జాన్ రెవిన్యూ, వైద్య సిబ్బంది, పోలీసులు పాల్గొన్నారు

విషజ్వరంతో అంగన్‌వాడీ ఆయా మృతి

ప్రజాశక్తి-చెన్నేకొత్తపల్లి

మండల కేంద్రంలోని 1వ అంగన్‌వాడీ కేంద్రంలో ఆయాగా విధులు నిర్వహిస్తున్న ఎరికల సాలమ్మ (53) సోమవారం మృతి చెందింది. మృతురాలి కుమారుడు ఎరికల శంకర్ తెలిపిన వివరాల మేరకు.. చెన్నేకొత్తపల్లిలోని ఎంపిడిఒ కార్యాలయ ఆవరణలో ఉన్న 1వ అంగన్‌వాడీ కేంద్రంలో విధులు నిర్వహిస్తున్న సాలమ్మ కొన్ని రోజుల నుంచి టైఫాయిడ్ జ్వరంతో బాధపడుతోంది. ఇందులో భాగంగా అనంతపురంలోని ఓ ప్రయివేట్ ఆసుపత్రిలో కూడా చేయించుకుని ఆదివారం ఇంటికి వచ్చింది. అయితే సోమవారం ఇంటి వద్ద మృతిచెందినట్లు తెలిపారు. విషయం తెలుసుకున్న అంగన్‌వాడీ ప్రభావతి, 4వ అంగన్‌వాడీ కార్యకర్త రమణమ్మ, 3వ అంగన్‌వాడీ కేంద్రం ఆయా రాచెర్ల నాగలక్ష్మి, తదితరులు మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

ప్రభుత్వ లాంఛనాలతో ఆర్మీ జవాను అంత్యక్రియలు

ఓబుల దేవర చెరువు : ఆదివారం రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన బిఎస్ఎఫ్ జవాన్ సోమశేఖర్ రెడ్డి అంత్యక్రియలు అతని స్వగ్రామం వేమారెడ్డి పల్లిలో ప్రభుత్వ లాంఛనాలతో సోమవారం నిర్వహించారు. బిఎస్ఎఫ్ బెంగళూరు బెటాలిన్ తో తుపాకులతో గాలిలో మూడు రౌండ్లు కాల్చి ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు జరిపించారు. పుట్టపర్తి ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే పల్లె రఘునాథ్ రెడ్డి తదితరులు జవాను సోమశేఖర్ రెడ్డి మృతదేహాన్ని సందర్శించి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ గోపి పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించిన సిపిఎం జిల్లా కార్యదర్శి

చిలమత్తూరు : మండల కేంద్రంలో శ్రీ పొట్టి శ్రీరాములు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని పోలింగ్ కేంద్రం 213ను సిపిఎం జిల్లా కార్యదర్శి ఇంతియాజ్ పరిశీలించారు. పిడిఎఫ్ అభ్యర్థి పోతుల నాగరాజు తరపున ఉన్న ఎజెంట్లు, సిపిఎం, సిఐటియు, ప్రజా సంఘాల నాయకులతో ఎన్నికలు జరుగుతున్న తీరును అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు ప్రవీణ్, వెంకటేష్, లక్ష్మినారాయణ, రామచంద్ర, గోవిందు తదితరులు పాల్గొన్నారు.

చిలమత్తూరు పోలింగ్‌కేంద్రం వద్ద సిపిఎం జిల్లా కార్యదర్శి ఇంతియాజ్

పోలింగ్ కేంద్రంలో నేతల హల్‌చల్

హిందూపురం: పశ్చిమ రాయలసీమ శాసన మండలి ఎన్నికలు సోమవారం జరిగాయి. పోలింగ్ కేంద్రాన్ని అధికారులు ఎంజిఎం పాఠశాలలో ఏర్పాటు చేశారు. ఓటర్లకు, పోలింగ్ బూత్ ఏజెంట్లకు మాత్రమే లోపలకు అనుమతులు ఉన్నాయి. అయితే అధికార పార్టీకి చెందిన మున్సిపల్ వైస్ చైర్మేన్ బలరామిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే అబ్దుల్ ఘనీ, కొండూరు వేణుగోపాల్ రెడ్డితో పాటు మరి కొంత మంది నాయకులు పోలింగ్ కేంద్రంలోనే ఉండిల్‌చల్ చేశారు. వీరిని చూసిన టిడిపి నేతలు అంబికా లక్ష్మినారాయణ, మరి కొంత మంది సర్పంచులు, నాయకులు సైతం లోపలికి వచ్చి ఓటర్లను ప్రభావితం చేశారు. ఇది గమనించిన డిఎస్‌పి యశ్వంత్ అసహనాన్ని వ్యక్తం చేశారు. వెంటనే ఇక్కడి నుంచి వెళ్లాలని సూచించారు. అయితే వారు వినక పోవడంతో శాఖ పరమైన చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని హెచ్చరించడంతో వారు అక్కడి నుంచి వెళ్లి పోయారు.

ప్రశాంతంగా ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్

హిందూపురంలో ఓటు వేయడానికి క్యూలో నిలబడ్డ పట్టభద్రులు

గుడిబండ : స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం జరిగిన ఎమ్మెల్సీ పట్టభద్రులు, ఉపాధ్యాయుల ఎన్నికలు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం4 గంటలకు సజావుగా జరిగాయి. మండల వ్యాప్తంగా ఈ ఎన్నికల్లో 632 మంది పట్టభద్రుల ఓటర్లు ఉండగా 21 మంది ఉపాధ్యాయుల ఓటర్లు ఉన్నారు. 632 మంది పట్టభద్రుల ఓటర్లలో 498 మంది తమ ఓటుహక్కును వినియోగించుకున్నారు. అదేవిధంగా మండల వ్యాప్తంగా 21 మంది ఉపాధ్యాయులు ఉండగా అందులో 20 మంది ఉపాధ్యాయులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. మొత్తం 653 ఓట్లు ఉండగా అందులో 518 మంది ఓటర్లు తమ ఓటుహక్కును వినియోగించుకున్నారని ఈ ఎన్నికల్లో 79 .9 శాతం ఓటింగ్ జరిగిందని ఎన్నికల రిటర్నింగ్ అధికారి, తహాశీల్దార్ నాగభూషణం తెలిపారు. ఎన్నికల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్ఐ మునిప్రతాప్ ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

గోరంట్ల : మండలంలో ఉపాధ్యాయ, పట్టభద్రుల పోలింగ్ సోమవారం ప్రశాంతంగా జరిగింది. మండల వ్యాప్తంగా పట్టభద్రులు 1640 ఓటర్లు ఉండగా ఇందులో 1333 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు దీంతో 81శాతం ఓటింగ్ నమోదైంది. ఉపాధ్యాయుల 138 ఓటర్లు ఉండగా ఇందులో 133 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నట్లు పోలింగ్ అధికారులు తెలిపారు. పుట్టపర్తి ఆర్డీవో భాగ్యసురేఖ పోలింగ్ సరళిని పరిశీలించారు

అగళి : మండలంలోని ఎమ్మెల్సీ ఎన్నికలు సజావుగా జరిగాయి .మొత్తం మండల వ్యాప్తంగా 456 ఓట్లు ఉండగా అందులో 387 ఓట్లు పోలింగ్ అయ్యాయి మొత్తం శాతం 85శాతం పోలింగ్ నమోదైందని తహాశీల్దార్ తెలిపారు. ఎమ్మెల్యే డాక్టర్ తిప్పేస్వామి తహాశీల్దార్‌తో పాటు టిడిపి మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి, మడకశిర సిఐ సురేష్ బాబు ఎన్నికల సరళి పర్యవేక్షించారు.

నంబుల పూలకుంట : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఎమ్మెల్సీ ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. మొత్తం 601 ఉండగా వారిలో 459 మంది ఓటు హక్కుకు వినియోగించుకున్నారు. అదేవిధంగా ఉపాధ్యాయులు 28 ఉండగా 26 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించడానికి సెక్టర్ ఆఫీసర్, రెవిన్యూ ,పోలీసు వారి సేవలు మరింతగా వినియోగించుకోవడం వల్ల ఎన్నికల ప్రశాంతంగా జరిగినాయి అని అధికార ప్రతిపక్షమితపక్ష నాయకులు తెలిపారు.

బుక్కపట్నం : ండల కేంద్రంలోని బాలుర పాఠశాలలో జరిగిన గ్రాడ్యుయేట్స్, టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికలు ప్రశాంతంగా ముగిసాయి. ఎన్నికల జరుగుతున్న తీరును జిల్లా కలెక్టర్ బసంత్ కుమార్, ఆర్డీవో భాగ్య రేఖ పరిశీలించారు. మండల పరిధిలో గ్రాడ్యుయేట్ ఓటర్లు 920 మంది ఉండగా 688 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఉపాధ్యాయ ఓటర్లు 67 ఉండగా 55 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. గ్రాడ్యుయేట్ ఓటు శాతం 74, ఉపాధ్యాయ ఓటు శాతం 82 గా నమోదయినట్లు అధికారులు తెలిపారు.

నల్లమాడ : ఎమ్మెల్సీ ఎన్నికలు నల్లమాడలో సోమవారం ప్రశాంతంగా ముగిశాయి. 81 మంది ఉపాధ్యాయ ఓటర్లు, 956 పట్టభద్రుల ఓటర్లు ఉన్నారు. ఉపాధ్యాయ ఓటర్లలో 49 మంది పురుషులు, 24 మంది మహిళ ఉపాధ్యాయులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. పట్టభద్రుల ఓటర్లలో 522 మంది పురుషులు, 191 మంది మహిళలు ఓట్లు వేశారు. ఉపాధ్యాయ ఓటర్లలో 90. 12 శాతం, పట్టభద్రుల ఓటర్లలో 74. 58 శాతం ఓట్లు పోలైనట్లు ఎన్నికల నిర్వహణ అధికారి, తహాశీల్దార్ దేవేంద్ర నాయక్ తెలిపారు.

గాండ్లపెంట : ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా నిర్వహించినట్లు పోలింగ్ అధికారులు స్వర్ణ కుమార్, శ్రీనివాసులు తెలిపారు. పట్టబద్రుల ఓటర్లు 686 గాను 573 ఓట్లు,ఉపాధ్యాయుల ఓటర్లు 30 గాను 28 పోలైనట్లు ఎన్నికల అధికారులు తెలిపారు. ఎలాంటి సంఘటనలు జరగకుండా ఎస్ఐ బి. మల్లికార్జున్ రెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

తలుపుల : సోమవారం జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. 98శాతం పోలింగ్ నమోదయిందని అధికారులు తెలిపారు.

పరిగి : మండల కేంద్రంలో సోమవారం జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికలు ప్రశాంతంగా ముగిసినట్లు పోలింగ్ అధికారులు సురేష్ బాబు, గుర్నాథ్ రెడ్డి తెలిపారు. పట్టభద్రుల ఓటర్లు 904 మందికి గాను 765 మంది, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో 87 మంది గాను 84 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలో చోటు చేసుకోకుండా ఎస్ఐ నరేంద్ర భద్రత చర్యలు చేపట్టారు.

అమరాపురం : మండల కేంద్రంలో సోమవారం జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికలు సజావుగా ముగిసినట్లు మండల ఎన్నికల అధికారి, తహాశీల్దార్ సురేష్ కుమార్ తెలిపారు. ఉపాధ్యాయ ఓటర్లు 49 మంది గాను 47 మంది, పట్టభద్రుల ఓటర్లు 1145 మంది గాను 794 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.

చిలమత్తూరు : సోమవారం జరిగిన పట్టభద్రుల,ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలు సజావుగా జరిగాయి. మండల వ్యాప్తంగా 782 మంది పట్టభద్రుల ఓటర్లుఉండగా మొత్తం 565 మంది, ఉపాధ్యాయ ఓటర్లు 32 మందికి గాను 31 మంది తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. గ్రాడ్యుయేట్ ఎన్నికలలో చివరి గంట సమయంలో అత్యధికంగా 135 ఓట్లు నమోదు కావడం విశేషం.

ఓబుల దేవర చెరువు : ఎమ్మెల్సీ ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. 94శాతం ఓటింగ్ నమోదైనట్లు తహాశీల్దార్ శ్రీధర్ తెలిపారు.

రొద్దం : మండల కేంద్రంలో ఎమ్మెల్సీ ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. పట్టభద్రుల ఓటర్లు 830 మందికి గాను 722 మంది, ఉపాధ్యాయుల ఓటర్లు 29 మంది గాను 28 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఈ ఎన్నికల తీరును పెనుకొండ ఎమ్మెల్యే శంకరనారాయణ, మాజీ ఎమ్మెల్యే పార్థసారథి, పర్యవేక్షించారు. తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సవిత వేర్వేరుగా పరిశీలించారు.

అమడగూరు : మండల కేంద్రంలో సోమవారం జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. పట్టభద్రుల ఓటరుల 558 మందికి గాను 407 మంది, ఉపాధ్యాయ ఓటర్లు 28 మందికి గాను 27 మంది తమ ఓటుహక్కును వినియోగించుకున్నట్లు పోలింగ్ అధికారి నాగరాజు, తహాశీల్దార్ రెడ్డి శేఖర్ తెలిపారు.

పుట్టపర్తి అర్బన్ : శాసనమండలి పట్టభద్రుల, ఉపాధ్యాయ నియోజకవర్గాలకు జరిగిన ఎన్నికలలో పట్టభద్రులు 70.70 శాతం మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఉపాధ్యాయులు 92.71 శాతం మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. జిల్లా వ్యాప్తంగా 43,310 మంది పట్టభద్రులు ఓటర్లు,ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు 3348 మంది ఓటర్లు ఉన్నారు. సాయంత్రం 4 గంటలకు పట్టభద్రులు 70.70 శాతం ఉపాధ్యాయులు 92.71 శాతం తమ తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.

పెనుకొండ : ఎమ్మెల్సీ ఎన్నికలు సోమవారం పట్టణంలో ప్రశాంతంగా ముగిశాయి. పట్టుభద్రుల ఓటర్లు 810 మందికి గాను 707 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. మరో పోలింగ్ కేంద్రంలో 850ఓటర్లు ఉండగా 719మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో భాగంగా 96 మంది ఓటర్లకు గాను 92మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు.

సోమందేపల్లి : మండల కేంద్రంలో సోమవారం నిర్వహించిన ఎమ్మెల్సీ ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. పట్టభద్రుల ఓటర్లు 1119 మందికి గాను 934 మంది, ఉపాధ్యాయ ఓటర్లు 35 గాను 35 మంది తమ ఓటుహక్కును వినియోగించుకున్నారు. ఎస్ఐ విజయ్ కుమార్ ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు.

హిందూపురం : ఉపాధ్యాయ, పట్టుభద్రుల శాసనమండలి ఎన్నికలు సోమవారం ప్రశాంతంగా ముగిశాయి. పట్టణంలోని ఎంజిఎం పాఠశాలలో పట్టుభద్రుల కోసం 6, ఉపాధ్యాయుల కోసం ఒక పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. పోలింగ్ ముగిసే సమయానికి పట్టుభద్రులు 3263 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఉపాధ్యాయులు మొత్తం 684 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారని ఎన్నికల అధికారులు తహాశీల్దార్ సౌజన్య లక్ష్మి, మున్సిపల్ కమిషనర్ డాక్టర్ వెంకటేశ్వర రావు తెలిపారు. అయితే పట్టుభద్రుల్లో మహిళలు వారి చంటి బిడ్డలతో పోలింగ్ కేంద్రాలకు వచ్చి వారి ఓటు వేశారు. స్థానిక ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ, వైసిపి ఇన్‌చార్జ్, ఎమ్మెల్సీ షేక్ మహమ్మద్ ఇక్బాల్ వారి ఓట్లు నమోదు చేసుకున్నారో లేదో తెలియరాలేదు. ఇక్కడ వారి ఓట్లు వేయడానికి రాలేదు. అన్ని నియోజక వర్గ కేంద్రాల్లో స్థానిక ఎమ్మెల్యేలు వారి ఓటుహక్కును వినియోగించుకున్నారు. డీఎస్పీ యశ్వంత్, సిఐ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు. ఎన్నికల అనంతరం బారీ బందోబస్తు నడుమ బ్యాలెట్ బాక్సులను అనంతపురంలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూముకు తరలించారు.

పెనుకొండ : ఎమ్మెల్సీ ఎన్నికల్లో భాగంగాసోమవారం పట్టణంలోని పోలింగ్ కేంద్రాల వద్ద పిడిఎఫ్ అభ్యర్థుల తరపున పోలింగ్ పనుల్లో వామపక్ష పార్టీలు సిపిఎం, సిపిఐ నాయకులు, ప్రజాసంఘాలు, యుటిఎఫ్, ఎస్‌టియు నాయకులు నిమగ్నం అయ్యారు.పోలింగ్ కేంద్రాల వద్ద ఉదయం నుంచి సాయంత్రం వరకు ఎన్నికల పోలింగ్ సరళిని పరిశీలించారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ నాయకుడు సుధాకర్, నారాయణస్వామి, రమేష్, నరేష్, రవీంద్రనాథ్ తదితరులు ఉపాధ్యాయులతో కలిసి ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు హరి, రమేష్, సిపిఐ నాయకులు శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

కనగానపల్లి : మండల పరిధిలో సోమవారం జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. 969 పట్టభద్రులకు 709 మంది ఓటుహక్కును వినియోగించుకున్నారు. అదేవిధంగా ఉపాధ్యాయ ఓటర్లు 22 మందికి ఉండగా 19 మంది ఓటు వేశారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా ఎస్ఐ హనుమంతురెడ్డి, ప్రత్యేక పోలీసు బృందాలు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.

బత్తలపల్లి : బత్తలపల్లి బాలుర ఉన్నత పాఠశాలలో సోమవారం జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి 75 శాతం, ఉపాధ్యాయ స్థానానికి 89.65 శాతం పోలింగ్ నమోదైంది. పోలింగ్ ప్రశాంతంగా నిర్వహించేందుకు సీఐ మన్సూరుద్దీన్, బత్తలపల్లి ఎస్ఎస్ఐ టీవీ శ్రీహర్ష, మరో ఎస్ఐ రాడార్, ముగ్గురు ఏఎసీలు, ఇద్దరు జమీందార్లు, 30 మంది పోలీసులతో గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. పోలింగ్ కేంద్రాన్ని ఎస్పీ రాహుల్‌దేవ్‌సింగ్, ఆర్డీఓ తిప్పేనాయక్, తహాశీల్దార్ యుగేశ్వరిదేవి, డిప్యూటీ తహాశ్దీర్ ప్రసాద్ పరిశీలించారు.

ముదిగుబ్బ : మండల కేంద్రంలోని బాలికల ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన ఎమ్మెల్సీ ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. మండలంలో 1,357 మంది పట్టభద్రులు ఉండగా 931 మంది ఓటుహక్కు వినియోగించుకోగా 68 శాతం పోలింగ్ నమోదైంది. ఉపాధ్యాయులకు 87 మంది ఉండగా 82 మంది ఓటుహక్కు వినియోగించుకున్నట్లు తహాశీల్దార్ నాగేంద్ర తెలిపారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా ఎస్ఐ హేమంత్‌కుమార్ బందోబస్తు ఏర్పాటు చేశారు.

లేపాక్షి: మండల కేంద్రంలోని జూనియర్ కళాశాలలో సోమవారం జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. పట్టభద్రులు 566 మందికి గాను 416 మంది ఓటుహక్కును వినియోగించుకున్నారు. అదేవిధంగా ఉపాధ్యాయులు మొత్తం 35 మందికి గాను 35మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఎన్నికల సరళిని డిఎస్‌పి యశ్వంత్ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో తహాశీల్దార్ కాటం బాబు, ఎంఇఒ నాగరాజు నాయక్, ఎస్ఐ మునీర్ అహమ్మద్, విఆర్ఒ తదితరులు పాల్గొన్నారు.

కదిరి టౌన్ : కదిరి మండలంలో సోమవారం జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల ప్రశాంతంగా ముగిసాయి. కదిరి పట్టణంతోపాటు రూరల్ వ్యాప్తంగా 75 శాతం మంది పట్టబద్రులు తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు.ఉపాధ్యాయుల శాసన మండలి ఎన్నికలకు సంబంధించి 94 శాతం ఉపాధ్యాయులు తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. అధికార వైసిపి పోలింగ్ కేంద్రాల వద్ద ప్రచారం కొనసాగించడం విమర్శలు దారితీసింది. ఓటింగ్ కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయసంఘటనలు చోటు చేసుకోకుండా కదిరి రూరల్ అప్ గ్రేడ్ సిఐ సూర్యనారాయణ అధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

ధర్మవరం టౌన్ : పట్టభద్రుల ఎమ్మెల్సీకి ధర్మవరం నియోజకవర్గవ్యాప్తంగా 12 పోలింగ్ కేంద్రాల్లో 9,560 ఓటర్లు ఉండగా 7,294 మంది ఓటుహక్కు వినియోగించుకోవడంతో 76.88 పోలింగ్ శాతం నమోదైంది. ఇందులో ధర్మవరం మండలంలో 6,291 మంది ఓటర్లకు 4933, ముదిగుబ్బ మండలంలో 1857 మందికి 930, బత్తలపల్లిలో 1092 మందికి 818, తాడిమర్రి మండలంలో 820 మందికి 813 మంది ఓటుహక్కు వినియోగించుకున్నారు. అలాగే నియోజకవర్గంలో ఉపాధ్యాయ ఓటర్లు 652 మంది ఉండగా 616 మంది ఓటుహక్కును వినియోగించుకోవడంతో 94.47 శాతం నమోదైంది. ధర్మవరం మండలంలో 487 మందికి 464, బత్తలపల్లి మండలంలో 58 మందికి 52, తాడిమర్రి మండలంలో 20 మందికి 18, ముదిగుబ్బ మండలంలో 87 మందికి 82 మంది ఓటుహక్కు వినియోగించుకున్నారు. కాగా ఆయా కేంద్రాల వద్ద ఇన్‌ఛార్జి డీఎస్పీ హుసేన్‌పీరా, వన్‌టౌన్ సిఐ సుబ్రమణ్యం, రూరల్ సిఐ మన్సూరుద్దీన్ ఆధ్వర్యంలో 200 మంది పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. పోలింగ్ అనంతరం బ్యాలెట్ బాక్సులను పటిష్టమైన బందోబస్తు నడుమ జిల్లాకేంద్రానికి తరలించినట్లు ఆర్డీఓ తిప్పేనాయక్ తెలిపారు. అలాగే స్థానిక జడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి, సతీమణి సుప్రియ, సోదరుడు కేతిరెడ్డి వెంకటకృష్ణారెడ్డితో కలిసి ఓటుహక్కు వినియోగించుకున్నారు.

4గంటల్లోపు వచ్చిన వారందరికీ ఓటు వేసే అవకాశం

రాష్ట్ర ఎన్నికల పరిశీలకులు హరి జవహర్‌లాల్, పూల భాస్కర్

ప్రజాశక్తి-బత్తలపల్లి

సాయంత్రం 4 గంటలలోపు పోలింగ్ కేంద్రానికి చేరుకుని క్యూలైన్‌లో నిలబడిన ప్రతి ఒక్కరికీ ఓటింగ్‌కు అవకాశం కల్పించాలని రాష్ట్ర ఎన్నికల పరిశీలకులు హరిజవహర్‌లాల్, పూల భాస్కర్ సంబంధిత సిబ్బందికి సూచించారు. సోమవారం మధ్యాహ్నం బత్తలపల్లిలోని పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాయంత్రం నుంచి ఓటర్ల సంఖ్య పెరిగే అవకాశం ఉందని, సమయానికి అనుగుణంగా వచ్చి క్యూలైన్లలో ఉన్న వారందరికీ స్లిప్‌లు ఇచ్చి క్యూలైన్‌లో ఉంచాలన్నారు. 4 గంటల అనంతరం ప్రధాన ద్వారం మూసివేయాలని సూచించారు. ఆనంతరం క్యూలైన్‌లో ఉన్న ఓటర్లతో ముచ్చిటించారు. సీఐ మన్సూరుద్దీన్, ఎస్ఐ బీవీ శ్రీహర్ష బందోబస్తు చర్యలు చేపట్టారు. ఆయన వెంట ఆర్టీఓ తిప్పేనాయర్, డిప్యూటీ తహాశీల్దార్ ప్రసాద్, ఎఎస్ లక్ష్మీనరసింహ, ఎఆర్‌డిలు, తదితరులు ఉన్నారు.

ఓటర్లతో మాట్లాడుతున్న అధికారులు

జిల్లాలో ఓటేసిన ప్రముఖులు

పోలింగ్ అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ బసంత్‌కుమార్

పెనుకొండ పోలింగ్‌కేంద్రం వద్ద వామపక్ష, ప్రజాసంఘాల నాయకులు

ఓటు హక్కు వినియోగించుకున్న కందికుంట

ఓటు హక్కు వినియోగించుకున్న పీడీఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి నాగరాజు


కిటికి వెలుతురులో బ్యాలెట్ పేపరు చూస్తున్న మాజీమంత్రి రఘువీరారెడ్డి


ఓటు హక్కు వినియోగించుకుంటున్న ఎమ్మెల్యే శంకరనారాయణ, మాజీ మంత్రి రఘువీరారెడ్డి, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి, ఎమ్మెల్యే తిప్పేస్వామి

ఓటుహక్కు వినియోగించుకుంటున్న మాజీ ఎమ్మెల్సీ తిప్పేస్వామి

ప్రశాంతంగా ముగిసిన పోలింగ్

ప్రజాశక్తి-మడకశిర

సోమవారం పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణంలో జరిగిన పశ్చిమ రాయలసీమ పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. మడకశిర నియోజకవర్గ వ్యాప్తంగా 4110 మంది పట్టభద్రులకు గాను 3257 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. దీంతో 79.2 శాతం పోలింగ్ నమోదైంది. అదే విధంగా ఉపాధ్యాయుల పట్టభద్రుల ఎన్నికల్లో 210 మందికి గాను 196 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. దీంతో 93.3 శాతం పోలింగ్ నమోదైంది. దు అయ్యింది. అత్యధికంగా పట్టభద్రులు రొళ్ల మండలంలో 392 మందికి 354 మంది ఓటు హక్కు వినియోగించుకొని 90.3% పోలింగ్ నమోదయింది .అదేవిధంగా అగలి 456 మందికి 387 మంది ఓటు హక్కు వినియోగించుకొని 84.8% పోలింగ్ నమోదయింది అదేవిధంగా మడకశిర మండల ంలో 1485 మందికి 12 24 మంది ఓటు హ క్కు వినియోగించుకొని 82.4% పోలింగ్ నమోదయింది .గుడిబండ మండలం 632 మందికి498 మంది ఓటు హక్కు వినియోగి ంచుకొని 78.7% పోలింగ్ నమోదయింది . అమరాపురం మండలం 1145 మందికి 794 మంది ఓటు హక్కు వినియోగించుకొని అత్యల్పంగా 69.3 శాతం మాత్రమే పోలింగ్ నమోదయింది. ఉపాధ్యాయ పట్టభద్రుల పోలింగ్‌లో అగలి మండలంలో ఇద్దరికి ఇద్దరు ఓటు హక్కు వినియోగించుకోగా వంద శాతం పోలింగ్ నమోదయింది. రొళ్ల మండలంలో 22 మందికి 21 మంది ఓటు హక్కు నియోగించుకున్నారు. గుడిబండ మండలంలో 21 మందికి 20 మంది, అమరాపురంలో 50 మందికి 47 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. మడకశిరలో 115 మందికి 116 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. సాయంత్రం నాలుగు గంటలకు ఓటర్లు అధికంగా ఉండడంతో తహశీల్దార్ బాలాంజనేయులు ఓటర్లకు టోకెన్లు జారీ చేయించి ఓటు హక్కు వినియోగించుకునే అవకాశం కల్పించారు. అమరాపురంలో సాయంత్రం 6 గంటల అయినప్పటికీ ఓటర్లు క్యూ లైన్ లో ఉండడంతో వారికి టోకెన్లు జారీ చేసి ఓట్లు వేయించడానికి అధికారులు చర్యలు తీసుకున్నారు. పోలింగ్ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సిఐ సురేష్ బాబు, ఎస్ఐ నాగేంద్ర తమ సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు .

ముగిసిన ఉరుసు ఉత్సవాలు

కొత్తచెరువు : కొత్తచెరువులో మూడురోజుల పాటు నిర్వహించిన ఉరుసు ఉత్సవాలు సోమవారం ముగిశాయి. ఆఖరి రోజు కావడంతో పుట్టపర్తి ఎమ్మెల్యే డి శ్రీధర్ రెడ్డి దర్గాను సందర్శించి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈసందర్భంగా ముస్లిం సోదరులు ఆయనను సన్మానించారు. ఈ కార్యక్రమంలో దర్గా మేనేజర్ హతావుల్ రహిమాన్, వక్ఫ్‌బోర్డు జిల్లా ఉపాధ్యక్షుడు షాజహాన్, ఎంపీటీసీ రఫీ జాకీర్, వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

ఆస్కార్ అవార్డు రావడం అభినందనీయం

ప్రజాశక్తి -పెనుకొండ

ఆర్ఆర్ఆర్ సినిమాలోని నాటు నాటు పాటకు అంతర్జాతీయ ఆస్కార్ అవార్డు రావడం పట్ల టీడీపీ జిల్లా అధ్యక్షులు బికె.పార్థసారథి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్ఆర్ఆర్ సినిమా ద్వారా మరోసారి తెలుగు వారి గొప్పదనం ప్రపంచానికి తెలిసిందన్నారు.

అభినందనల వెల్లువ : తెలుగు దర్శకుడు రాజ్ మౌళి దర్శకత్వం వహించిన ఆర్ఆర్ ఆర్ సినిమాలోని నాటు నాటు పాటకు ఆస్కార్ రావడం పట్ల ప్రముఖ విద్యా, సామాజికవేత్త, ఆత్మీయ రక్తదాత సంస్థ వ్యవస్థాపకుడు డాక్టర్ ప్రతాప్ అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా సోమవారం పట్టణంలోని ఎన్ టి ఆర్ సర్కిల్ వద్ద కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు గంగరాజు, నాగరాజు, త్రివేంద్ర,గోవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

పెనుకొండలో కేక్ కోస్తున్న అభిమానులు

కరాటేలో జాతీయ స్థాయిలో అగ్రస్థానం గర్వకారణం

ప్రజాశక్తి-కదిరిటౌన్

ప్రతిభ కనబరిచిన విద్యార్థులను అభినందిస్తున్న బ్లూ మూన్ విద్యాసంస్థల చైర్మన్ శివశంకర్, వాల్మీకి విద్యాసంస్థ కరస్పాండెంట్ అనిల్ కుమార్ రెడ్డి

పట్టణానికి చెందిన పలువురు విద్యార్థులు కరాటే లో జాతీయస్థాయిలో అగ్రస్థానం సంపాదించడం గర్వకారణమని బ్లూ మూన్ విద్యాసంస్థల చైర్మన్ శివ శంకర్, వాల్మీకి విద్యాసంస్థ కరస్పాండెంట్ అనిల్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. కదిరి పట్టణంలోని స్థానిక బాలుర జూనియర్ కళాశాలలో కరాటే మాస్టర్ షేక్షావలి ఆధ్వర్యంలో కదిరి స్పోర్ట్స్ సక్సెస్ మీట్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా బ్లూమూన్ విద్యాసంస్థల చైర్మన్ శివశంకర్, వాల్మీకి విద్యాసంస్థల కరస్పాండెంట్ అనిల్ కుమార్ రెడ్డి, సీనియర్ కరాటే మాస్టర్ ఆంజనేయులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కరాటే, బాక్సింగ్, ఫెన్సింగ్, ఆర్చరీ, జూడో తదితర క్రీడలలో శాప్, ఖేల ఇండియా, ఎస్‌జిఎఫ్ఐ లలో రాష్ట్రస్థాయి నుండి జాతీయస్థాయి వరకు అగ్రస్థానంలో మొట్టమొదటిసారిగా కదిరి పట్టణం నుండి ఎంపిక కావడం గర్వకారణమన్నారు. డాన్స్ రంగంలో మనూస్ డాన్స్ అకాడమీ విద్యార్థులు రాష్ట్ర, జాతీయస్థాయిలో, ప్రముఖ టీవీ ఛానల్స ఆడిషన్స్ లో పాల్గొన్నారన్నారు. ఈసందర్భంగా విద్యార్థులకు శాలువాలతో అతిథులు సన్మానించారు.కదిరి ప్రాంతాన్నిఉన్నత స్థాయికి తీసుకు వెళ్తున్న మనోహర్ షేక్షావలి లను అభినందిస్తున్నట్లు అతిథులు తెలిపారు.

ఓటుహక్కు వినియోగించుకున్న ప్రముఖులు

ఓటు వేసినట్లు వేలు చూపుతున్న ఆర్డీఓ భాగ్యరేఖ దంపతులు

కదిరి టౌన్ : పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటు హక్కు ను టిడిపి కదిరి ఇంచార్జ్ కందికుంట వెంకటప్రసాద్ వినియోగించు కున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టభద్రులు ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించుకొని ప్రజా స్వామ్యాన్ని రక్షించుకోవాలని సూచించారు.

పుట్టపర్తి అర్బన్ :పుట్టపర్తి లోని శివాలయం వీధిలో ఉన్న మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో కలెక్టరు బసంత్ కుమార్ తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. కలెక్టరు అందరితో పాటు క్యూలో వెళ్లి ఓటు వేశారు. అలాగే పుట్టపర్తి ఆర్‌డిఒ భాగ్యరేఖ తన ఓటు హక్కును వినియోగించుకున్నారు.

పెనుకొండ : వైసిపి జిల్లా అధ్యక్షులు, పెనుకొండ ఎమ్మెల్యే మాలగుండ్ల శంకర నారాయణ పట్టణంలోని జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. అదేవిధంగా వైసిపి పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డితో కలిసి పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించారు.

అలవెన్సు బకాయిలు చెల్లింపు

కదిరి టౌన్ : ఆర్టీసీ ఉద్యోగులకు అక్టోబరు-22 నుండి డిసెంబరు 22 వరకు బకాయివున్న నైట్ అవుట్,ఓవర్ టైం,టీ అలవెన్సులను కదిరి డిపోలోని కండక్టర్లు,డ్రైవర్లు,గ్యారేజి ఉద్యోగులకు దాదాపు రూ.15.00 లక్షలుఉద్యోగుల ఖాతాలో జమ అయినట్లు హరి మోహన్ తెలిపారు. ఈ మేరకు రాష్ట్ర వ్యాప్తంగా వున్న అన్ని డిపోల ఉద్యోగులకు అలవెన్సు బకాయిలు చెల్లించడం పట్ల ఉద్యోగులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

శ్రీవారి రథోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే

ప్రజాశక్తి-కదిరి అర్బన్

శ్రీమద్ ఖాద్రి లక్ష్మీ నరసింహ స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం నిర్వహించిన బ్రహ్మ రథోత్సవంలో శాసనసభ్యులు డాక్టర్ పివి సిద్దారెడ్డి పాల్గొన్నారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే రథం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి, శ్రీవారి బ్రహ్మరథాన్ని అశేష భక్తాదుల మధ్య లాగారు. రథోత్సవానికి జిల్లా నుండే కాకుండా పొరుగు జిల్లాలు, రాష్ట్రాల నుండి కూడా అధికసంఖ్యలో భక్తులు హాజరయ్యారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా తగిన చర్యలు తీసుకున్నారు.

వ్యక్తి ఆత్మహత్య

ప్రజాశక్తి-గుత్తి

గుత్తి మండలంలోని లచ్చానుపల్లి గ్రామంలో ఓ వ్యక్తి సోమవారం ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన టి.సుంకన్న కుమారుడు తలారి సుధాకర్ (30) కొంతకాలంగా కడుపునొప్పితో బాధపడుతున్నాడు. బాధను భరించలేక ఎవరూ లేని సమయంలో ఇంట్లో పైకప్పుకు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతునికి భార్య అనిత, కుమారుడు ఉన్నారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు

మహిళలు అన్నిరంగాల్లో రాణించాలి

ప్రజాశక్తి-ఉరవకొండ



మహిళా దినోత్సవంలో మాట్లాడుతున్న వక్తలు

అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు సోమవారం మండల పరిధిలోని మోపిడి, ఇంద్రావతి, పెద్ద ముష్టూరు గ్రామాల్లో ఆర్డీటీ కమ్యూనిటీ ఆర్గనైజర్ తిమ్మరాజు, లక్ష్మీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రాకెట్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్ర హెల్త్ ఎడ్యుకేటర్ ఎస్ఎండి.షఫీ, ఆర్డీటీ సెక్టార్ టీం లీడర్ హుస్సేన్‌బీ మాట్లాడుతూ మహిళలకు, కిశోర బాలికలకు,మహిళా సాధికారత గురించి మహిళలు సమాజంలో ఎదుర్కొంటున్నా సమస్యలు వాటిని ఎలా సమర్థవంతంగా ఎదుర్కోవాలో అనే అంశాలపై అవగాహన కల్పించారు.ముఖ్యంగా ఆడపిల్లల అనేక సమస్యలకు మూలం నిరక్షరాస్యత అని అమ్మాయిలు చదువుకొంటేనే సాధికారత సాధించ వచ్చునని తెలిపారు.సమాజంలోఅడా,మగ వైవిధ్యాలు ఎక్కువని మహిళల పట్ల చిన్నచూపు చూస్తున్నారని సరికాదని తెలిపారు.ఒంటరి మహిళలకు ఎదురయ్యే సమస్యలను ఎలా ఎదుర్కోవాలి అనే అంశంపై ఆడవారిని వేధిస్తున్న వరకట్నం,భ్రూన హత్యకు నివారణకు చట్టాలున్నాయని చట్టాల గురించి అవగాహన పెంచుకోవాలని,బాల్యవివాహాలు జరగకుండా చూడాలని అప్పుడే నిజమైన మహిళా దినోత్సవం అని తెలిపారు. ఫోక్సో, దిశా చట్టాల గురించి తెలుసుకోవాలని సూచించారు. అనంతరం ఆర్డీటీ వ్యవస్థాపకులు ఫాదర్ విన్సెంట్ ఫెర్రర్ చిత్రపటానికి పూలమాలను వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కమ్యూనిటీ ఆర్గనైజర్లు భగవాన్‌దాస్, తిమ్మరాజు, స్వాతి, సీడీసీ సభ్యుడు వెంకటప్ప, సీబీటీ శాంతి, గ్రామ ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.